క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు


కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం పురస్కరించుకుని అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఒకే రైతుకు ఎక్కువ ఎరువులు విక్రయించరాదు


ఫర్టిలైజర్స్ దుకాణంలో విచారణ చేస్తున్న ఏడీఏ ఆంజనేయ

పాములపాడు: రైతుకు ప్రభుత్వ నిభందనల ప్రకారం 50 మించి ఎరువుల బస్తాలు విక్రయించరాదని ఏడీఏ ఆంజనేయ తెలిపారు. మంగళవారం మండలంలోని వాడాల గ్రామంలో జ్యోతి ఫర్టిలైజర్స్ టాప్ 20 బయ్యర్స్ యూరియా బస్తాలు ఒక రైతుకు 50 బస్తాలు విక్రయించడంపై విచారణ చేపట్టారు. ఆన్‌లైన్ ద్వారా విషయం తెలుసుకున్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేశారు. అలాగే మద్దూరు గ్రామంలో ఆర్బీకే కేంద్రాన్ని తనిఖీ చేశారు. మిట్టకందాల గ్రామంలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రం పరిశీలించారు. త్వరిత గతిన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఓ ఫణీశ్వరరెడ్డి, ఆర్బీకే సిబ్బంది తదితరులు ఉన్నారు.

చిరుధాన్యాలతో ప్రయోజనం

పాములపాడు: చిరుధాన్యాల వలన కలిగే ఉపయోగాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ నాగమణి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్ పఖ్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినులకు చిరుధాన్యాలను చూపిస్తూ వాటి వలన కలిగే ఉపయోగాలు వివరించారు. ప్రధానంగా చిరుధాన్యాల వలన పోషకాలు పెరుగుతాయని, రక్త హీనత, క్యాల్షియం లోపించకుండా ఉంటుందని వివరించారు. విద్యార్థినులచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు శివలక్ష్మి, నాగమ్మ, నాగమద్దమ్మ, చెన్నమ్మ పాల్గొన్నారు.

గిరిజన గూడెంలో బోరుకు మరమ్మతు


ఎర్రమఠం గిరిజనగూడెంలో నీటిసౌకర్యం కోసం బోరు ఏర్పాటు చేసిన దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని ఎర్రమఠం గ్రామపంచాయతీలోని మజరా గ్రామమైన గిరిజన గూడెంలో నీటి సౌకర్యం కోసం ఐటీడీఏ అధికారుల సమక్షంలో సర్పంచు బాల ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో మంగళవారం బోరు ఏర్పాటు చేశారు. మూడునాలుగు నెలలుగా గూడెంలోని బోరు మరమ్మతులకు గురైంది. వేసవిని దృష్టిలో ఉంచుకొని గిరిజన గూడెంలో నీటిసమస్య తలెత్తకుండా పంచాయతీ నిధులనుంచి మరమ్మతుల చేయించి నీటి సౌకర్యాన్ని పునరుద్ధరించారు. గిరిజనులకు వేసవిలో నీటి సమస్య లేకుండా చూసుకుంటామని సర్పంచు బాల ఎల్లయ్య సూచించారు.

కామేశ్వరీదేవికి బంగారు గాజుల బహూకరణ


ఈఓకు బంగారు గాజులు అందిస్తున్న దాతలు

మహానంది: మహానంది ఆలయంలో వెలసిన శ్రీ కామేశ్వరీదేవికి మార్కాపురం పట్టణానికి చెందిన మొగిలి ప్రసాదరావు, శ్రీలక్ష్మీ దంపతులు మంగళవారం బంగారు గాజులు, వెండిచెంబును బహూకరించారు. గతంలో మహానందికి వచ్చి సంతానం కోసం మొక్కుకున్నారు. కోరిన కోరిక నెరవేరడంతో ఆరు తులాల బరువున్న నాలుగు బంగారు గాజులు, ఒక వెండిచెంబును ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి బహూకరించారు. కార్యక్రమంలో వేదపండితులు రవిశంకర అవధాని, ముఖ్య అర్చకుడు రాజారత్తయ్యబాబు శర్మ, మాజీ ధర్మకర్త బండి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేలం పాటలు వాయిదా

నందికొట్కూరు: పట్టణంలోని జైకిసాన్ పార్కులో మంగళవారం వారపు సంత, దిన మార్కెట్, బస్టాండ్, జంతువధ శాల, మాంసపు మార్కెట్ల వేలం పాట నిర్వహించారు. నిర్ధారించిన దానికంటే తక్కువ ధరకు వేలం పాడడంతో బుధవారం సాయంత్రం 3.30 గంటలకు వేలాలు వాయిదా వేశామని కమిషనర్ కిశోర్ తెలిపారు.

దిగుబడి మెరుగ్గా.. ధర ఆశాజనకంగా

- రబీలో అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు
- ఆశాజనకంగా మొక్కజొన్న దిగుబడులు
- ప్రస్తుతం మార్కెట్ ధర క్వింటా రూ.2,040
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు


ధాన్యాన్ని కాటావేస్తున్న హమాలీలు


మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

జూపాడుబంగ్లా: రబీ సీజన్‌లో సాగుచేసిన మొక్కజొన్న పంట దిగుబడులు ఆశించినమేర రావడం, మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభిస్తుండటంతో పెట్టిన పెట్టుబడులు చేతికందితున్నాయనే సంతోషాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వర్షాలు సకాలంలో కురుస్తుండటంతో దిగుబడుల ఆశాజనకంగానే ఉంటున్నాయని, ధరలు కూడా బాగానే ఉన్నాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సాధారణం కంటే అధికంగా సాగు..

నందికొట్కూరు నియోజకవర్గం పరిధిలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, మిడుతూరు, పాములపాడు, కొత్తపల్లి, పగిడ్యాల మండలాల పరిధిలో మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 3,165 హెక్టార్లు ఉండగా 6,339 హెక్టార్లలో మొక్కజొన్న పంటను సాగుచేసినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. అలాగే ఆత్మకూరు, వెలుగోడు మండలాల పరిధిలో సాధారణ సాగు విస్తీర్ణం 652 హెక్టార్లు కాగా 1,205 హెక్టార్లలో మొక్కజొన్న పంటను సాగుచేశారు. బోర్లు, బావుల కింద సాగు చేసిన మొక్కజొన్న పంట ఎకరాకు 25 నుంచి 30క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తోంది.

పెరిగిన పెట్టుబడులు

ఐదేళ్ల క్రితంతో పోల్చితే ప్రస్తుతం వ్యవసాయ పెట్టుబడులు భారీగా పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు. గతంలో ఎకరా మొక్కజొన్న పంటను సాగు చేసి దిగుబడి చేతికందేలోగా రూ.20వేల ఖర్చు వచ్చేదని, ప్రస్తుతం రసాయనిక, క్రిమిసంహారక మందుల ధరలు, కూలీ, సేద్యం ఖర్చులు పెరిగిపోవటంతో ఎకరా మొక్కజొన్నల సాగుకు రూ.35వేల ఖర్చు అవుతుందని చెబుతున్నారు.

ఆశించిన స్థాయిలో మద్దతు ధర

రబీలో సాగుచేసిన మొక్కజొన్న పంట ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్లు వచ్చినట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం క్వింటాలు మొక్కజొన్నల ధర రూ.2,040లు ఉండటం రైతులకు కొంత ఊరటనిస్తుంది. పంట చేతికందే సమయానికి క్వింటా మొక్కజొన్న రూ.2,500లు ఉండగా స్థానిక వ్యాపారులు కుమ్మక్కై ధరను రోజు రోజుకు తగ్గిస్తుండటంతో రైతులను కాస్త ఆందోళనకు గురిచేస్తోంది. ధర రూ.2వేల కంటే తగ్గితే రైతులు నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని, ఇంతకంటే ధర మరింతగా తగ్గితే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

ధరలు కొంత మేర మేలు



రబీ సీజన్‌కు గాను నేను 8.50ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశాను. ఎకరాకు రూ.35వేలు ఖర్చు వచ్చింది. దిగుబడి ఎకరాకు 25 నుంచి 30క్వింటాలు వచ్చింది. మొన్నటి వరకు క్వింటాలు ధర రూ.2,500లు ఉండగా వ్యాపారులు రేట్లు తగ్గించి ప్రస్తుతం క్వింటాలు రూ.2,040లకు అడుగుతున్నారు. అయినా కొంత వరకు మేలే. –నజీర్, రైతు, జూపాడుబంగ్లా

ధర తగ్గితే నష్టమే



రబీ సీజన్‌కుగాను నేను కేసీ కాల్వ కింద 6ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశాను. ఎకరాకు రూ.35వేలు పెట్టుబడి కాగా దిగుబడి ఎకరాకు 30 నుంచి 35క్వింటాలు వచ్చింది. ప్రస్తుతం ధర క్వింటాలుకు రూ.2,040ల ప్రకారం వ్యాపారులు కొంటున్నారు. ఇంత కంటే ధర మరింతగా తగ్గితే నష్టం వాటిల్లుతుంది.

– నరసింహ, రైతు జూపాడుబంగ్లా

మద్దతు ధర కంటే తగ్గితే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



ప్రభుత్వం మొక్కజొన్నలకు క్వింటాలుకు రూ.1,750ల మద్దతు ధరను ప్రకటించింది. ప్రభుత్వ మద్దతు ధరకంటే తక్కువగా వ్యాపారులు రేట్లు తగ్గిస్తే విషయాన్ని జిల్లా అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతు భరోసా కేంద్రాల పరిధిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ధాన్యం కొనుగోలు చేస్తాం. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధరకంటే బహిరంగ మార్కెట్లో ధర అధికంగా ఉన్నందున కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయం.

– విజయశేఖర్, ఏడీఏ, నందికొట్కూరు

రేపు శ్రీరామనవమి వేడుకలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో ఈ నెల 30వ తేదీ(గురువారం)న శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పాతాళగంగ సమీపంలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సీతారామచంద్రుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ ఎస్ లవన్న తెలిపారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి ఆలయంలో ముందుగా సీతారాముల వారికి, అనంతరం ఆంజనేయస్వామికి విశేష పూజాధికాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం సీతారాముల కల్యాణోత్సవం ప్రారంభం అవుతుందన్నారు. కల్యాణోత్సవం తరువాత భక్తులకు పానకం, వడపప్పు తదితర తీర్థప్రసాదాలు అందిస్తారన్నారు.

మహానందిలో..

మహానంది: మహానందిలో ఈ నెల 30వ తేదీన శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. శివకేశవులకు నిలయమైన మహానందిలో వెలిసిన శ్రీ సీతా, సమేత కోదండరాముల వారికి గురువారం ఉదయం విశేష అభిషేకం, అర్చనల అనంతరం సీతారాముల వారి కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు.

ఆత్మకూరులో సీతారాముల కల్యాణం

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 30వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా శ్రీసీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. తొలిసారిగా ఈఏడాది దేవాలయంలో శ్రీసీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నెల 29వ తేదీన కలశ స్థాపన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ నెల 31వ తేదీ ఉదయం శ్రీసీతారాముల పట్టాభిషేకం, అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గూడేల్లో సమస్యలు లేకుండా చర్యలు


గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీఓ, సర్పంచు, అధికారులు

కొత్తపల్లి: మండలంలోని గిరిజన గూడేల్లో సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ మేరి అన్నారు. మంగళవారం ఎర్రమఠం సర్పంచు బాల ఎల్లయ్యతో కలసి జనాలగూడెన్ని సందర్శించారు. అధికారులు ఎంపీడీఓను గ్రామ అడాప్టెడ్ అధికారిగా నియమించినందున గూడెంలో ఏమైన సమస్యలు ఉన్నాయా అన్న విషయాలను తెలుసుకొనేందుకు గిరిజనులతో మమేకం అయ్యారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అదేవిధంగా ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సచివాలయాన్ని సందర్శించి వసతులు, సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గూడెంలోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, గ్రామవలంటీర్లు ఉన్నారు.

చెంచు గూడెంను సందర్శించిన అధికారులు

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామం చెంచుగూడెంను తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ సుమిత్రమ్మలు మంగళవారం సందర్శించారు. గూడెంలోని చెంచు మహిళలతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పక్కా గృహాలు కావాలని అడగడంతో 21 పక్కా గృహాలు నిర్మాణానికి ఆర్డీటీ కి, ఒక వికలాంగుడికి పింఛన్ కోసం సదరం సర్టిఫికెట్ తెప్పించాలని ఆదేశించారు. వారి వెంట సర్పంచు మాణిక్యమ్మ, పంచాయతీ కార్యదర్శి తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు న్యాయం చేస్తాం


భూములను సర్వేచేయిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్

కొత్తపల్లి: గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి, సర్పంచు మశమ్మ అన్నారు. గ్రామంలో కొంతమంది రైతులు భూములు ఆన్‌లైన్‌లో లేక ఇబ్బందులు పడుతున్నారని, పొలాలను ఆన్‌లైన్ చేయించేందుకు అధికారులతో కలసి కృషి చేస్తామని చెప్పారు. మంగళవారం మండలంలోని చదరంపెంట గూడెం సమీపంలోని సమస్యాత్మక భూములను ఆత్మకూరు రెవెన్యూ అధికారులతో కలసి సర్వే చేయించారు. ముందుగా రైతులు ఏర్పాటు చేసుకున్న హద్దులను పరిశీలించారు. ఎవరెవరు ఏఏ సర్వేనెంబర్లలో ఉన్నారో కొలతలు వేసి హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ చదరంపెంట గూడెం సమీపంలోని కురుకుంద పొలిమేరలోని సర్వేనెంబర్ 1421, 1423, 1425, 1426 సర్వేనెంబర్లలో గువ్వలకుంట్ల రైతులకు 21 మందికి ఒక్కొక్కరికి ఎకరం చొప్పున 25 ఏళ్ల క్రితం పట్టాలు ఇచ్చారన్నారు. అప్పటినుంచి ఇప్పటిదాకా రైతులు సాగులో ఉన్న ఆన్‌లైన్‌లో లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ, సర్వేయర్ హరికిరణ్, కురుకుంద వీఆర్వో మహబూబ్ బాషా వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రారెడ్డి, మల్లారెడ్డి ఉన్నారు.

అతివలకే అగ్రతాంబూలం

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- మహిళలే వైఎస్సార్‌సీపీ బలం, బలగం
- వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కు పంపిణీ


వైఎస్సార్ ఆసరా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

మిడుతూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సంక్షేమ పథకాల్లోనూ అతివలకే అగ్రతాంబూలం ఇచ్చి మహిళా పక్షపాతిగా నిలుస్తున్నారని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మిడుతూరు మండల మహిళా సమాఖ్య కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై లబ్దిదారులకు ఆసరా చెక్కు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి అన్ని హామీలు నెరవేర్చిన ఘనత మన సీఎంకే దక్కిందన్నారు. మహిళలే వైఎస్సార్‌సీపీకి బలం, బలగం అని అన్నారు. గత ప్రభుత్వ హయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మహిళలను మోసం నిలువుగా మోసం చేస్తే .. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం స్వయం సహాయక సంఘాల రుణాలను విడతల వారీగా మాఫీ చేసి ఆదుకున్నారన్నారు. మండల వ్యాప్తంగా 596 సంఘాల్లోని 5,960 మంది మహిళలకు రూ. 3,21,53,175 చెక్కును అందించారు. అలాగే తలముడిపి గ్రామానికి చెందిన బంట్రోతుల దిబ్బలన్న వైద్య సహాయం నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి విడుదలైన రూ.4 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్‌కుమార్ రెడ్డి, ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్, రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి, కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల సిద్దారెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, మండల మహిళా అధ్యక్షురాలు శ్యామలమ్మ, సెక్రటరీ రవణమ్మ, ట్రెజరర్ శివమ్మ, ఎంపీటీసీ కోటేశ్వరరావు, సర్పంచ్‌లు మదార్‌సాహెబ్ పాల్గొన్నారు.


హాజరైన మహిళలు

రైతులందరికీ న్యాయం చేస్తాం

మిడుతూరు: మండలంలో అకాల వర్షాలకు నష్టపోయిన రైతుల సమస్యలను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి అందిరకీ న్యాయం జరిగేలా చేస్తానని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హామీ ఇచ్చారు. మంగళవారం మండలపరిధిలోని ఖాజీపేట, చింతలపల్లి, జలకనూరు గ్రామాల్లో పూర్తిగా దెబ్బతిన్న పండు మిరప, మొక్కజొన్న, కంది తదితర పంటలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంటలు చేతికివచ్చే సమయంలో వడగండ్ల వాన ధాటికి అరటి, బొప్పాయి, పండు మిరప, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, లక్షలలో రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. ఏ పంట ఎన్ని హెక్టార్లలో నష్టం వాటిల్లిన విషయాన్ని ఇప్పటికే వ్యవసాయ అధికారులు అంచనా వేశారన్నారు. పంట నష్టంపై ఇటీవల అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడినట్లు వెల్లడించారు. కాగా ప్రభుత్వం నష్టపరిహారం రైతుల అకౌంట్లలో జమ చేయడంతో కౌలుకు తీసుకున్న రైతులకు పరిహారం అందడం లేదని కౌలు రైతులు ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే పొలం కౌలుకు తీసుకున్న రైతుల పేరు మీదనే నష్టపరిహారం వచ్చేలా నమోదు చేయాలని వ్యవసాయ అధికారులకు ఆదేశించారు.


జలకనూరులో దెబ్బతిన్న మిరపను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

అక్కాచెల్లెమ్మలకు ఆసరా పండుగ



శ్రీశైలంలో చెక్కును పొదుపు మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఆత్మకూరులో కార్యక్రమానికి హాజరైన మహిళలు

- శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ

ఆత్మకూరు: పొదుపు మహిళలకు ఉగాది, శ్రీరామనవమి, రంజాన్ పండుగల నడుమ ఆసరా పండుగ వచ్చిందని, సంక్షేమ పథకాలు అమలు కావాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారం చేపట్టాలని, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో మూడో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలోని 896 స్వయం సహాయక సంఘాలకు రూ.4,43,72,698 లు చెక్కును ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా పొదుపు మహిళల ఖాతాల్లో జమ చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కావాలంటే గ్రామాల్లో ఎవరైనా మృతి చెందితే తప్పామంజూరు అయ్యేది కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు ప్రభుత్వ పథకాలు నేరుగా మంజూరు అవుతాయని చెప్పారు. అంతకుముందు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పొదుపు మహిళా సంఘాల సభ్యులు ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డిని దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, ఎంపీపీ తిరుపాలమ్మ, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, మెప్మా సిబ్బంది విజయభారతి, ఉమామహేశ్వరి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు యూనస్, ఎంపీడీఓ మోహన్‌కుమార్, కమిషనర్ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు అంజాద్‌అలీ, రాజమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కరివేన గ్రామంలో ఫాచ్యునల్ లగ్జరీ విలాస్ (వేంచర్)ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇది ప్రజా సంక్షేమ ప్రభుత్వం

శ్రీశైలంప్రాజెక్ట్: వైఎస్సార్ ఆసరా పథకం కింద 3 వ విడుత చెక్కును పొదుపు మహిళా గ్రూపులకు స్థానిక రెడ్ల కల్యాణ మండపంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అందజేశారు. శ్రీశైలం మండలంలోని సున్నిపెంట, లింగాలగట్టు, శ్రీశైలం లో ఉన్న 331 పొదుపు సంఘాలకు రూ.1,79,96,068 ల చెక్కును పొదుపు మహిళా సంఘాలకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పొదుపు మహిళలకు క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లడుతూ.. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. మహిళల ఆర్థిక స్వావలంభన కోసం అనేక పథకాలతో ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారని చెప్పారు. 3 విడుతలుగా శ్రీశైలం మండలంలోని పొదుపు సంఘాలకు రూ.5,38,28,778 అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేనన్నారు. శ్రీశైలం మండలానికి తాను ఎమ్మెల్యే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని, అభివృద్ధి చేసే నాయకులను, పార్టీలను మరువకుండా తిరిగి అధికారంలోకి తెచ్చే బాధ్యత మీ అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ రాజేంద్రసింగ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఎంఏ రజాక్, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి జింకా గుండయ్య యాదవ్ , మండల నాయకులు భరత్‌రెడ్డి, టీఎమ్ రఫి, , ఆసాది ప్రవీణ్ దివ్యతేజ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఆర్థిక సాయం

కొద్దిరోజుల క్రితం అడవికి నిప్పు రాజుకుని మంటలు వ్యాపించి నది తీరంలో చేపలు పట్టుకునే లింగాలగట్టుకు చెందిన మత్స్యకారుల వలలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. స్పందించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి బాధితుడు ఎమ్ సామేలు, దానియోలు, సుందర్‌రాజులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మంగళవారం రెడ్ల కల్యాణ మండపం వద్ద అందించారు. అలాగే సున్నిపెంట సచివాలయం –3లో ఆధార్‌నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు.

వేలాలకు స్పందన కరువు

మహానంది: మహానంది దేవస్థానం కార్యాలయంలో నిర్వహించిన వివిధ అంశాల వేలాలకు స్పందన కరువైంది. మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓ జనార్దన్, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక దేవస్థానం కార్యాలయంలో వేలాలు చేపట్టారు. తొమ్మిది అంశాలకు వేలాలు జరగగా కేవలం వాహనాల పూజలు చేసుకునేందుకు నిర్వహించిన వేలానికి ఎం. వెంకటరమణయ్య రూ.4.50లక్షలతో నిర్వహణ హక్కును దక్కించుకున్నారు. కొబ్బరికాయల సరఫరా, ఎలక్ట్రికల్ వస్తువుల సరఫరా, ఖాళీ డబ్బాల వేలం, భూముల కౌలువేలాలు, తదితర వాటిని వాయిదా వేస్తున్నట్లు ఈఓ తెలిపారు.

కంటివైద్య పరీక్షలు

మహానంది: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గాజులపల్లె ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కంటివైద్యాధికారి కృష్ణమోహన్‌రెడ్డి వృద్ధులకు కంటివైద్య పరీక్షలు చేపట్టారు. డాక్టర్ వెంకటరెడ్డి, ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి, ఆశా కార్యకర్తలు రెహానా, లక్ష్మీ, అస్మిత్ పాల్గొన్నారు.

ఆర్బీకేల ద్వారా సకాలంలో ఎరువులు


.గాజులపల్లెలో మాట్లాడుతున్న డీఏఓ జయదేవ్

మహానంది: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులను సకాలంలో అందిస్తామని జిల్లా వ్యవసాయాధికారి జయదేవ్ అన్నారు. గాజులపల్లె, గోపవరం, రైతు భరోసా కేంద్రాలలో మంగళవారం తనిఖీ చేపట్టారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయాధికారి జయదేవ్ మాట్లాడుతూ మహానంది మండలంలో ఇప్పటి వరకు 1390 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు పంపిణీ చేశారన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో 27 టన్నుల ఎరువుల నిల్వలు ఉన్నాయని తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు ఏప్రిల్, మే నెలలో ఆర్బీకే గోడౌన్లలో ఎరువులను ముందుగానే అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఏడీఏ రాజశేఖర్, మార్క్‌ఫెడ్ అసిస్టెంట్ మేనేజర్ అనూష, టెక్నికల్ ఏఓ హరిప్రియ, హబ్ మేనేజర్ ఉషారాణి, మండల ఏఓ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ జలవనరుల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగి వెంకటగిరి (46) మంగళవారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు టూ టౌన్ ఎస్ఐ గంగయ్య యాదవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మృతుడు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబీకులు సోమవారం ఓ శుభకార్యానికి ఇతర ప్రాంతానికి వెళ్లగా ఎవరూ లేని సమయంలో ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. చుట్టుపక్కవారు గమనించి గిరిని కిందకు దించగా కొన ఊపిరితో ఉండడంతో 108 కు సమాచారం అందించారు. అయితే వారు వచ్చేలోగానే గిరి మృతిచెందాడని, ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ వెల్లడించారు.

దుకాణాల వేలం

మిడుతూరు: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న 14 దుకాణాలకు మంగళవారం గ్రామ సర్పంచ్ జయలక్ష్మమ్మ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. గత సంవత్సరం 14 దుకాణాలకు నెలకు రూ. 26,011 బాడుగ కింద ఆదాయం వచ్చేదని, ప్రస్తుతం నిర్వహించిన వేలం పాటలో నెలకు రూ. 30,301 బాడుగ వస్తుందని పంచాయతీ కార్యదర్శి సుధీర్ తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఫకృద్దీన్, గ్రామ ఉప సర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మరకతలింగేశ్వరుడికి అన్నాభిషేకం

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో వెలిసిన జిల్లాలోని ఏకై క నవగ్రహాల, శ్రీ గంగా, గౌరీసమేత మరకతలింగేశ్వర ఆలయంలో మంగళవారం ప్రదోష కాలంలో విశేషాభిషేక, అర్చనలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్ రావు ఆధ్వర్యంలో అన్నాభిషేకం, అభిషేకం, అర్చన పూజలు చేశారు.

సీఎం జగనన్నతోనే మహిళల అభివృద్ధి


చెక్కు పంపిణీ చేస్తున్న మున్సిపల్ మేనేజర్ బేబీ

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందని మున్సిపల్ మేనేజర్ బేబీ అన్నారు. మంగళవారం పట్టణంలోని హాజీనగర్‌లో ఏర్పాటు చేసిన మూడో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని 12, 13, 14, 16, 17, 27 వార్డులకు చెందిన 133 పొదుపు సంఘాలకు రూ, 85, 22,017 చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం శాంతకుమారి, పట్టణ సమాఖ్య ప్రెసిడెంట్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.